మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# మాది రైతు ప్రభుత్వం..



రైతు భరోసా సమావేశంలో హాజరైన పలువురు మంత్రులు

- రైతు భరోసా ఎలా అమలు చేయాలనే అభిప్రాయ సేకరణ
- అన్నదాతల అభిప్రాయాల మేరకే రైతు భరోసాపై తుది నిర్ణయం
- రైతులకు ఇచ్చిన ప్రతి మాట నిలుపుకుంటాం..
- రాష్ట్ర వనరులు, సంపదను ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగిస్తాం
- ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తాం..
- వనపర్తి రైతు భరోసా సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు

**వనపర్తి ప్రతినిధి, జులై 12 ప్రభాతవార్త :** తమది రైతు ప్రభుత్వమని, రైతును రాజు చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని సర్కారు పని చేస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సమావేశంలో నిర్వహించిన రైతు భరోసా సదస్సుకు కమిటీ సభ్యులైన నాగేశ్వరరావు తోపాటు రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు, ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నదాతల అభిప్రాయాల మేరకే రైతు భరోసా పై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని పంట సహాయం ఏ విధంగా చేస్తే బాగుటుంది అనే అభిప్రాయం స్వయంగా రైతుల నుండి తీసుకోవడానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రైతుల ముందుకు వచ్చారని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రైతు భరోసా అభిప్రాయ సేకరణలో భాగంగా శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులతో వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో వర్క్ షాప్ నిర్వహించారు. సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికినీ వ్యవసాయ రంగాన్ని, చిన్న, సన్నకారు రైతులను కాపాడుకునేందుకు, రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి కృషి చేస్తుందన్నారు. అయితే ఇది రైతు ప్రభుత్వం కాబట్టి రైతు భరోసా కార్యక్రమాన్ని ఏ విధంగా అమలు చేయాలి, ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి. కౌలు రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలి అనే విషయాలను రైతుల ద్వారా అభిప్రాయం స్వీకరించి, శాసన సభలో పెట్టీ అందరి ఆమోదంతో విధి విధానాలు ఖరారు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వనరులు, సంపదను ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని, ప్రజలు, రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ కష్టార్జితం నుంచి చెల్లించిన పన్ను, వివిధ రంగాల ద్వారా ప్రభుత్వానికి సమకూర్చిన ఆదాయం ద్వారా ప్రజల కష్టానికి న్యాయం చేస్తామని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతు సంక్షేమం కోసం స్పష్టమైన కార్యచరణతో ముందుకు వెళదామని అన్నారు. రైతు భరోసా పథకంలో రైతులకు లబ్ది చేకూరే విధంగా రైతులు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాలలో నిపుణులు, వివిధ వర్గాల వారి అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకొని రైతు సంక్షేమం దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆలోచనను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రజా రంజకంగా పాలన సాగించడం జరుగుతందని, చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా రైతు భరోసా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో కష్టాలకు ఓర్చి, చెమటోడ్చి పంట పండించే రైతులకు ప్రాధాన్యత నివ్వడం జరుగుతందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మరో కమిటీ సభ్యుడు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు రాజు చేయాలనే చిత్తశుద్ధితో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుందన్నారు.



**రైతు భరోసా ఎలా అమలు చేస్తే బాగుంటుంది**

రైతు భరోసాను ఏవిధంగా అమలు చేస్తే బాగుటుందో రైతులనే అడిగి తెలుసుకునేందుకు, రైతుల అందరి అభిప్రాయానికి అనుగుణంగా

- మిగతా4లో..



మంత్రులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి



మంత్రులకు స్వాగతం పలికిన పోలీస్ అధికారులు



రైతు భరోసా కార్యక్రమాన్ని నేలపై కూర్చుని వీక్షిస్తున్న రైతులు



రైతు భరోసా కార్యక్రమంలో హాజరైన పలువురు కలెక్టర్లు



రైతు భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌలు రైతు

## అక్కడ 7గంటలకే వైన్స్ బంద్..

- ఇష్టారీతిగా బెల్టు షాపులకు మద్యం సరఫరా
- వారికి నిబంధనలు వర్తించవా..?

**అడ్డాకుల, జులై 12, ప్రభాతవార్త :** అడ్డాకుల మండల కేంద్రంలోని ఓ దుకాణ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదంటూ మండల కేంద్రంలో మద్యం ప్రియులు వాపోతున్నారు. రాత్రి 10గం.ల వరకు షాప్ తెరిచి ఉంచాలని, మైనర్లకు మద్యం సరఫరా చేయకూడదని, షాపుముందు ధరల పట్టిక ఉంచాలని, ప్రభుత్వ నిబంధనలు ఉన్నా షాపు నిర్వాహకులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు.




రాత్రి 7గంటలకే మూసిన వైన్స్‌దుకాణం

ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి బెల్టు షాపులకు మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని దుర్గావైన్స్ రాత్రి 7 గం.లకు షాప్ బంద్ చేయడంతో కన్నమర్ల గ్రామాలలో ఉన్న బెల్టు షాపులను ఆశ్రయిస్తున్నారు. దీంతో బెల్టుషాపు నిర్వాహకులు ఒక్కొక్క క్వార్టర్, బీర్ సీసాల వెంట రూ.20 నుండి రూ.30 వరకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వైన్‌షాపు 10 గంటల వరకు తెరిచి ఉంచినట్లయితే మద్యం తీసుకునే వారమని, ఏడు గంటలకే మూయడంతో బెల్టు షాపులను ఆశ్రయించి రూ.30 అధికంగా చెల్లిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. దుర్గా వైన్స్‌లో ఇంత తతంగం జరుగుతున్న అడ్డాకుల మండలంలో అసలు ఎక్సైజ్ అధికారులు ఉన్నారో లేరో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని ఒక్కొక్క గ్రామంలో 5 నుండి 6 వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. బెల్టు షాపులలో రాత్రి 12 గం.ల వరకు విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముతున్నారు. నిబంధనలు అతిక్రమించిన దుర్గ వైన్‌షాపుపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుని, షాపును రాత్రి 10 గం.ల వరకు తెరిచి ఉంచేలా వైన్స్ యాజమాన్యానికి సూచించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వన మహోత్సవం లక్ష్యం పూర్తి చేయాలి..

- మహబూబ్‌నగర్ జిల్లాలో 34 శాతమే పూర్తయింది
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా
- వివిధ పథకాలపై కలెక్టర్ విజయేంద్రి బోయి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రి బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 12 ప్రభాతవార్త :** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండలాల వారిగా, వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వనమహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాల, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఎపిఎంలు, మండల ప్రత్యేక అధికారులు,వివిధశాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 34 శాతం మాత్రమే మొక్కలు నాటే లక్ష్యం సాధించినట్లు తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో ప్రగతిలో వెనుకబడి ఉందని తెలిపారు. పంచాయతీ, మండలాల వారిగా వన మహోత్సవం కార్యక్రమం సమీక్షించి సూచనలు చేశారు. జిల్లాలో 55 లక్షల మొక్కలునాటే లక్ష్యాన్ని నిర్ణీత వ్యవధిలోగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మొక్కలు నాటేందుకు అంచనాలు పూర్తి చేయకుంటే పూర్తి చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. గత 10 సంవత్సరాలలో మొక్కలు నాటిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించి మొక్కలు ఎన్ని బతికి ఉన్నాయి, ఎన్ని చనిపోయాయి పరిశీలించాలని సూచించారు. మొక్కలు చనిపోయిన చోట మొక్కలు నాటాలని అన్నారు. జిల్లాలో మొక్కలు నాటేందుకు రెడీగా ఉన్నాయని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే లక్ష్యం వేగవంతం చేయలని అన్నారు. వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటి పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని మున్సిపల్ అధికారులకు, ఎంపిడిఓలకు, జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించి మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. హోంస్టెడ్ కింద ఇంటింటికి మొక్కలు పంపిణీ పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, మెదడు వాపు లాంటి వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ పంచాయతీ కార్యదర్శుల ప్రాథమిక విధి అని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు వ్యాప్తి చెందవని, దోమలు వృద్ధి చెందకుండా నాలాల్లో మురుగు నీరు ప్రవహించేలా క్లీన్ చేయడం, నిర్మాణ,ఓపెన్ ప్లాట్‌లలో నీరు నిల్వ లేకుండా దోమలు వృద్ధి చెందకుండా ఆంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ మల వసర్జన రహితంగా గ్రామాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత 3 సంవత్స రాలలో డెంగ్యూ, చికెన్‌గున్యా కేసులు రిపోర్టు అయిన హై రిస్క్ గ్రామాలను మండల ప్రత్యేక అధికారులు సందర్శించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల, గర్భిణీలు, వృద్ధులు, దోమకాటు వలన ప్రమాదం మారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడి పాఠశాలల్లో హ్యాండ్‌వాష్,పరిశుభ్రతపై అవగాహన కలిగించాలని అన్నారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్య పాత్ర పోషిస్తారని, గ్రామాలలో పారిశుద్ధ్యం పరిశుభ్రత కార్యక్రమాలు అన్ని పాఠశాలలు, కార్యాలయాల్లో చేపట్టడమే కాక విద్యా, వైద్య రంగాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా జిల్లాకు మండలం వారిగా కేటాయించిన టార్గెట్‌ల ప్రకారం లబ్దిదారులను గుర్తించాలని, మైక్రో

- మిగతా4లో..

## గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం..

- గంజాయి బారినుంచి యువతను కాపాడుకుందాం
- కళాశాలలో యాంటి డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలి
- డ్రగ్స్ సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం
- అవగాహన సదస్సులో ఎస్పీ జానకి ధరావత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 12 ప్రభాతవార్త :** గంజాయి నుండి యువతను కాపాడుకుందామని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కళాశాలల, పోలీసు అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణ కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ మాట్లాడారు. మత్తు పదార్థాల నుండి యువతను కాపాడుకుందాని అధికారులకు పిలుపునిచ్చారు. గంజాయి అక్రమ రవాణా వలన భవిష్యత్తులో యువత ప్రమాదంలో పడుతుందని, మత్తు పదార్థాల బారిన పడి ఎంతోమంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. యువత జల్సా జీవితంతో పాటు సులభంగా డబ్బు సంపాదన కోసం అక్రమ మార్గంలో గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని, ఇలాంటి యువతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు.అలాగే ప్రతి

- మిగతా4లో..

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**



కూరగాయల రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 12 ప్రభాతవార్త:** పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు

- మిగతా4లో..

## స్వచ్ఛతలో ఒక్కరోజు...

- పారిశుద్ధ కార్యక్రమాల్లో పియు
- ఎన్ఎస్ఎస్ బృందం
- మహబూబ్‌నగర్‌లో చెత్తను
- సేకరించిన 200 మంది వాలంటీర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 12 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రద్దీ ప్రాంతాలైన బస్టాండు, రైల్వే స్టేషన్, నవోదయ ఆసుపత్రి, జూనియర్ కాలేజ్, డీఈఓ కార్యాలయం, ఎర్రసత్యం చౌరస్తా, తెలంగాణ చౌరస్తా మొదలగు ప్రాంతాలలో చెత్తా చెదారాన్ని సేకరించి సంచులలోవేసి డంపింగ్‌యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమావత్ సైదా యూత్ ఆఫీసర్ హైదరాబాద్ హజరై ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. పరిసరాల శుభ్రత ఒక్కరోజు ఒక అంతర్భాగం కావాలని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ స్పెషల్ క్యాంప్స్ అడ్వెంచర్ క్యాంప్స్ చేయడం




ఒకరోజు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ద్వారా సమాజం సేవలో భాగస్వాములు అవుతారని, ఒక్కొక్క వాలంటీర్స్ ఎంతో మంది జనాలను ప్రభావితం చేయవచ్చునని తద్వారా రపధాని మోడీ కలలుగన్న స్వచ్ఛభారత్ సిద్ధిస్తుందని అన్నారు. ఎన్ఎస్ఎస్ సెల్ కో ఆర్డినేటర్ డా. కె. ప్రవీణ్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకుంటే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇంటిముందు నీటిని నిల్వ ఉంచుకోరాదని, ఎప్పటికప్పుడు చెత్త పదార్థాలను ఒక దగ్గర సమకూర్చి మున్సిపాలిటీ వెహికల్‌లో వెయ్యాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్స్‌ని వాటర్ బాటిల్స్‌ని చెత్తకుండీలలో వేయాలని, జాతీయ సేవా పథకం ద్వారా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వ్యవస్థ పరిశుభ్రం కోసం అందరు నడుం బిగించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. ఎస్.రవికుమార్, డా. ఎస్.ఎన్ అర్జున్‌కుమార్, గాలన్న, డా. వెంకట రాఘవేందర్ డా. ఈశ్వర్‌కుమార్, జ్ఞానేశ్వర్, డా. చిన్నదేవి, డా. ఇమ్మానుయేలు, డా. శివకుమార్ సింగ్, శ్రీనివాసులు, 200ల మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో చెత్తను సేకరిస్తున్న పియుఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

## మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలి

**అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



**గద్వాల ప్రతినిధి జులై 12 ప్రభాతవార్త:** మత్తు పదార్థాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ముసిని వెంకటేశ్వర్లు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నందు మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ నివారణకు 5గురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి నార్కోకోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న విద్య శాఖ, పోలీసుశాఖ ఎక్సైజ్, వెల్ఫేర్, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కొరకు ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి కె.వెంకటలక్ష్మి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి యం. హృదయరాజు, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని కె.సుధారాణి, వైద్య శాఖ అధికారి డా.జి.రాజు, సెక్టోరల్ ఆఫీసర్ ఎస్తేరు రాణి, యంఎఎల్‌డి అసిస్టెంట్ ప్రొఫెసర్లు హెచ్ నర్సింహులు, వి.మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## 18న అప్రెంటిషిప్ మేళా..

**ఒకేషనల్ విద్యార్థులకు ఉపాధి ప్రయోజనం**

**ఉమ్మడి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : డిఐఈఓ**



**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 12 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఇంటర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఈనెల 18న ఉదయం 10 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ సుమన్ తెలిపారు. ఈ అప్రెంటిషిప్ మేళాలో మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒకేషనల్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ పాల్గొనాలని సూచించారు. ఒకేషనల్ మేళా గురించి పూర్తి వివరాలు డిఐఈఓ తెలియజేశారు. ఇంటర్ బోర్డు, ఒకేషనల్ విభాగం వారి ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కళాశాలల ఒకేషనల్ సిబ్బంది, ప్రిన్సిపాళ్లు, సంబంధిత విద్యార్థులకు తగు సమాచారం అందించి ప్రోత్సహించాలని అన్నారు. ఒకేషనల్ ప్రభుత్వ లేదా ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులు వివిధ పరిశ్రమలు, ఆసుపత్రులు, సంస్థల ఉద్యోగాల్లో చేరడానికి ఇదొక మంచి అవకాశమని అన్నారు. ఈ అప్రెంటిషిప్ మేళాను ప్రతిఒక్క ఒకేషనల్ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు తగు సర్వేలు నిర్వహించి ఎక్కువ మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంపొందేలా కృషి చేయాలని అన్నారు. ఒకేషనల్ లెక్చరర్లు బోధనతో పాటు ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. మెడికల్, పారా మెడికల్, ఇంజనీరింగ్, కామర్స్ రంగాల్లో విద్యార్థులు రాణించడానికి ఇదొక సదవకాశంగా భావించవచ్చని పేర్కొన్నారు. ఒకేషనల్ జూ. కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, సీనియర్ లెక్చరర్ నందూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అప్రెంటిషిప్ మేళా నిర్వహించబడుతుందని ఈ మేళాకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ చరవాణి సంఖ్య 7013838794 ద్వారా పొందవచ్చని తెలిపారు.

## ఇంటింటా ఇన్నోవెటర్ కార్యక్రమం



**గద్వాల ప్రతినిధి జులై 12 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలకు సాధికారిత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్న ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములను కావాలని ఎంపీవో చెన్నయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీఓ కార్యాలయం సమావేశం హాల్లో ఇంటింటా ఇన్నోవేటర్ 2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు వారిలోని అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులను సమర్పించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న ఆవిష్కర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చెన్నయ్య, టీఎస్ఐసీ, డిస్ట్రిక్ట్ ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ జగదీశ్, గద్వాల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ సెక్రెటరీలు పాల్గొన్నారు. ఆవిష్కర్తలు వారి దరఖాస్తులను 9542746728 వాట్సప్ ఆగస్టు 3వ తేదీలోగా పంపించాలని సూచించారు.

### తొట్లే, నామకరణ మహోత్సవంలో

## మాజీ జెడ్పిచైర్ పర్సన్, ఇంచార్జి సరిత, మున్సిపల్ చైర్మన్ కేశవ్



**గద్వాల ప్రతినిధి జులై 12 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హాల్లో జరిగిన పెదొడ్డి రామకృష్ణ కుమార్తె, కుమారుడి తొట్లే, నామకరణ మహోత్సవ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత, మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, అమరావాయి కృష్ణరెడ్డి, తుమ్మల నర్సింహులు, డిటిడిసి నర్సింహులు, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖర్ రెడ్డి, నాగేంద్ర యాదవ్, మహేశ్, నాగరాజు, టీఎన్ఆర్ జగదీశ్, బిల్డర్ రామకృష్ణ, డిఆర్ శ్రీధర్, కుర్వ శ్రీనివాసులు, రంజిత్, ఆనంద్ గౌడ్, కోటేశ్, బోయ శ్రీనివాసులు, సద్దనోంపల్లి గోపాల్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి, దడవాయి నర్సింలు, కృష్ణయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి : సిఐటియు డిమాండ్



**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 12 ప్రభాతవార్త :** తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మహబూబ్‌నగర్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో ఏడవరోజు నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ పొమ్మనకుండా పొగబెట్టినట్లు కాంగ్రెస్, కేంద్ర బిజెపి ప్రభుత్వం అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం టీచర్‌కు రెండు లక్షలు, హెల్పర్‌కు లక్ష రూపాయల పెన్షన్ ఇస్తామని జీఓ నంబర్ 10 తెచ్చిందని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ఆగిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వాలు వచ్చి రాష్ట్ర కాంగ్రెస్, కేంద్ర బిజెపి ప్రభుత్వం అంగన్‌వాడీలకు మొండిచేయి చూపడానికి ప్రయత్నిస్తున్నాయని, దీన్ని నిరసిస్తూ ఆరో తారీఖు నుంచి జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలు జరుపుతున్నామన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి టీచర్‌కు రెండు లక్షలు, హెల్పర్‌కు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్ చివరినెల జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఈనెల 15న ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి కార్యక్రమం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్యమ్మ, బాలమణి, పుష్పమ్మ, సిఐటియు పట్టణ నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శపాఠశాల నిర్మాణపనులను సకాలంలో పూర్తిచేయాలి

- దేవరకద్రలో అమ్మ ఆదర్శపాఠశాల నిర్మాణపనుల పరిశీలన
- బస్వాయపల్లి వనమహోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శైలేంద్ర ప్రతాప్

**దేవరకద్ర,జులై 12 ప్రబాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణపనులను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శైలేంద్ర ప్రతాప్ సూచించారు.దేవరక ద్రలోని ఎంపీపీఎస్,జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల నిర్మాణపనులను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శైలేంద్ర ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యవంతంగా ఉండేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శపాఠశాల నిర్మాణపనులను అదనపు కలెక్టర్ స్వయంగా తిరిగి చూశారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కూడ ఆయన తనఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను కూడ పరిశీలించారు. ప్రజలకు ఎప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.



బస్వాయపల్లిలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్



దేవరకద్రలో అమ్మ ఆదర్శపాఠశాల నిర్మాణపనుల పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**బస్వాయపల్లి వనమహోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్..**

దేవరకద్ర మండలం బస్వాయపల్లిలో శుక్రవారం జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శైలేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ మొక్కలు నాటారు. సర్పరీతో పాటు మొక్కల ప్లాంటేషన్‌ను కూడ ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బందిలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- బిజెపి మతోన్మాద చర్యలను అడ్డుకోవాలి ప్రజా సమస్యలపై సిపిఎం కార్యకర్తలు నిరంతరం పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర నాయకులు ఎంవీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు రమణ

**గద్వాల ప్రతినిధి జులై 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు ఎంవీరమణ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో జికె ఈదన్న అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో ఎంవి రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారని ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుకు వెంటనే కృషి చేయాలని అన్నారు. రైతు బంధు రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ముందుగా ప్రకటించాలని డిమాండు చేశారు. రైతు సదస్సుల పేరుతో కాలయాపన చేస్తున్నారని వెంటనే రైతాంగానికి రుణమాఫీ రైతు బంధు డబ్బులు ఇవ్వాలని డిమాండు చేశారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిజెపి మతోన్మాద చర్యలను తీవ్రతరం చేసిందని మతం పేరుతో ప్రజలపై దాడులు పెరిగిపోయాయని బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య విద్వేశాలు సృష్టించే మతోన్మాద చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. రాష్ట్రంలో గెలిచిన బిజెపి నాయకులు విభజన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో కేంద్రాన్ని నిలదీయాలని అన్నారు. బిజెపి మతోన్మాద విధానాలతో పాటు ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలోని మెడికల్ కళాశాలలో తక్షణమే తరగుతుల ప్రారంభించాలని, అలంపూరు చౌరస్తాలోని ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండు చేశారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున అన్ని పిహెచ్‌సి లలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని వెంటనే నియమించి రోగులకు కావలసిన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని డిమాండు చేశారు. భారత్ మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికి నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండు చేశారు. జిల్లా విద్యాధికారులు ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ పెరగాలని ప్రైవేటు యాజమాన్యాలు పెంచుతున్న విపరీత ఫీజుల వల్ల ప్రజలు కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలంపూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వెంటనే ప్రారంభించి కళాశాల వసతి గృహాల తరలింపు జీవోను వెంటనే వెనకకు తీసుకోవాలని ఐజలో నూతన వసతి గృహాలను ప్రారంభించాలని డిమాండు చేశారు. మండలాల్లో ఉన్న కార్యకర్తలు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రేవల్లి దేవదాసు జి.రాజు పరంజ్యోతి వివి నరసింహ, మద్దిలేటి నర్మద, ఉప్పేర్ నర్సింహ, రమేశ్ తదితరులు ఉన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు:మున్సిపల్ కమిషనర్



ఆత్మకూరులోని ఐదవ వార్డులో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చైర్పర్సన్

**ఆత్మకూర్ జులై 12 ప్రభాతవార్త :** ప్రస్తుత వర్షాకాల సీజన్లో ప్రజలు అంటువ్యాధులు బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ నాగరాజు విజ్ఞప్తి చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ ఐదవ వార్డులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాల సీజన్లో డెంగ్యూ ,మలేరియా, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణ కోసం ప్రత్యేకంగా పిచికారి కార్యక్రమాన్ని పట్టణ వ్యాప్తంగా చేపట్టినట్లుగా ఆయన తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బందికి పట్టణ ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన నీటిని ఉపయోగించుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రోజుల తరబడి మురుగునీరు దరికి చేరనివ్వకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పాటించి మున్సిపల్ పాలకవర్గానికి మున్సిపల్ సిబ్బందికి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మున్సిపల్ వార్డు కౌన్సిలర్ పోషణ మండల రామకృష్ణ మున్సిపల్ సిబ్బంది పలువురు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో వాసవిమాతకు పంచామృతాభిషేకం

- ఘనంగా పల్లకిసేవ - అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



వాసవిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర,జులై 12 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు ,భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశారు. బిల్లకంటి స్వప్నబృందం అధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

**ఘనంగా కుంకుమార్చన..** అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామృతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్యకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసుల దృష్టిలో మాత్రం నిందితుడు పరార్

**అధికారిక కార్యక్రమంలో హాజరు పట్టణ ప్రజల విస్మయం**



పరారైన నిందితుడు అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**ఆత్మకూర్ జులై 12 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని మోట్లంపల్లి గత శివారులో గత నెల 29వ తేదీన జరిగిన 19 గొర్రెల దొంగతనం కేసుకు సంబంధించి బాధితురాలు వనమాల వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేసు విచారిస్తున్న ఆత్మకూరు సిఐ శివకుమార్ ,ఎస్సై నరేందర్లు గురువారం రాత్రి ఆత్మకూర్ పట్టణ సమీపంలోని బిజెపి క్యాంపు కార్యాలయ ఆవరణలో అనుమానస్పదంగా సంచరిస్తున్న నలుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు విచార ణ కొనసాగించారు. గత నెలలో జరిగిన దొంగతనానికి సంబంధించి తామే దొంగతనానికి పాల్పడ్డామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లాకు చెందిన రామకృష్ణ ,మద్దిలేటి మల్లికార్జున్, హరికృష్ణ తదితరులను అదుపు లోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ దొంగత నానికి సంబంధించి ఆత్మకూరు పట్టణానికి చెందిన ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి సంపూర్ణ సహకారాలు అందించాడని నిందితులు విచారణలో పేర్కొన్నప్పటికి ఆత్మకూరుకు చెందిన నిందితుడు పరారీలో ఉన్నాడని గురువారం రాత్రి పోలీసులు విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ చేపట్టిన ఫ్రైడే అధికారిక కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోషన్న దర్శనమివ్వడంతో పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దొంగతనానికి సంపూర్ణ సహకారం అందించిన పోషణను అరెస్టు చేయకుండా పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు విస్మయ వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులకు ఒక న్యాయం ప్రజాప్రతినిధులకు ఒక న్యాయమా అంటూ పట్టణానికి చెందిన పలువురు ఆశ్చర్యమే వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆత్మకూరు ఎస్సై వి.నరేందర్ ను ప్రభాతవార్త వివరణ కోరగా తమకు లభించిన సమాచారం మేరకు నిందితుడు పరారీలో ఉన్నాడని బదిలీ ఇవ్వడం విశేషం.

## కోయిల్‌సాగర్‌లో నిలకడగా నీటిమట్టం

**దేవరకద్ర,జులై 12 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో శుక్రవారం నీటిమట్టం నిలకడగా ఉండి. జూరాల నుండి కోయిల్‌సాగర్‌కు కృష్ణాజలాల సరఫరాను నిలిపి వేశారు. వర్షాలు కూడ అంతగా కురవకపోవడంతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడం లేదు. శుక్రవారం సాయంత్రంనాటికి ప్రాజెక్టులో17.4ఫీట్ల మేర నీరు ఉంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ స్థోమత 32.5 ఫీట్లు.

## భూత్పూర్ ఐదోవార్డులో డ్రైడే..!!



**భూత్పూర్,జులై 12,ప్రభాతవార్త :** ప్రతి శుక్రవారం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు,సిబ్బంధి నిరహిం చే ఫ్రైడే డ్రైడేను శుక్రవారం పీహెచ్‌సీ సీహెచ్ఓ అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు అమిస్తాపూర్‌లో డ్రైడేను నిర్వహించారు. వార్డులో మురుగునీరు నిల్వ ఉంచిన ప్రదేశాలలో ఆరోగ్య సిబ్బంధి పర్య వేక్షించి తొలగించారు. ఈకార్యక్రమంలో భూత్పూర్ పీహెచ్‌సీ హెచ్ఎ శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ రమేష్, ఆర్‌పి సువర్ణ, ఆశావర్కర్ హైమావతి తదితరులు ఉన్నారు.

## మొక్కలే జీవకోటికి జీవనాధారం



**ఉట్కూర్,జులై 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముక్దంపూర్ గ్రామంలో మండల స్పెషలాఫీసర్ జీవరత్నం, మండల ఎంపిడిఓ ధనుంజయగౌడ్‌తో కలసి 75వ వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని జీవకోటి మనుగడకు చెట్లే ముఖ్యమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవాన్ని అందరూ చెట్లను విరివిగా నాటాలని తెలియజేశారు. అలాగే అంగన్‌వాడి సెంటర్ స్కూల్ ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈసీ టిఏ పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపిడిఓకు వినతి



**జడ్చర్ల,జులై 12 ప్రభాతవార్త :** వర్షాకాలం సందర్భంగా గ్రామాలలో ఖాళీ ప్రదేశాలో నీళ్ల నిల్వడం వలన, మురుగు ఏర్పడి దోమలు వృద్ధి చెందే ప్రమాదముందని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ జడ్చర్ల ఎంపిడిఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డికి బిసి సేన నాయకులు వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి, సీజనల్ రోగాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని బిసి సేన నాయకులు కోరారు. అలాగే గ్రామాలలో వీధి కుక్కల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుక్కల బెడద నుండి ప్రజలకు ఉపశమనము కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసిసేన మండల అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, మండల ప్రధాన కార్యదర్శి గొడుగు నర్సిములు, నాయకులు రామస్వామి, రాము, భీమ్‌రాజ్, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థికి చేయూత



అశ్వినితేజను కస్తూర్బాలో చేర్పిస్తున్న వేదిక సభ్యులు

**బిజినపల్లి, జులై 12 ప్రభాతవార్త:** సరైన సమయంలో చదువుకు సాయం చేస్తే ఓ బ్రహ్మాండమైన వ్యక్తి సమాజానికి తయారవుతాడన్న మాటను నిజం చేశారు తెనుగోళ్ల విద్యావంతుల వేదిక సభ్యులు. కుమ్మెర గ్రామానికి చెందిన అనంత అల్లోజి వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్‌లో తనకున్న వ్యవసాయ పొలాన్ని కోల్పోయాడు. నిర్వాసితులైన అల్లోజీకి పరిహారం అందకపోగా ఆత్మహత్య చేసుకున్నాడు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబంలో ఇంటిపెద్ద లేకపోవడంతో అశ్వినితేజ చదువుకు దూరమైంది. విషయం తెలుసుకున్న తెనుగోళ్ల విద్యావంతుల వేదిక సభ్యులు డీఈఓ గోవిందరాజులతో మాట్లాడి తొమ్మిదో తరగతి చదువుతున్న అశ్విని తేజను బిజినపల్లి కస్తూర్బా స్కూల్లో చేర్పించారు. భవిష్యత్తులో సైతం విద్యార్థి చదువు కొనసాగించేందుకు వేదిక తరపున పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పెబ్బేటి మల్లికార్జున్, నాగర్‌కర్నూల్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డా.పెబ్బేటి విజయ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య,నాగర్‌కర్నూల్ జిల్లా ఫిషరీస్ సొసైటీ ఛైర్మన్ వాకిటి ఆంజనేయులు, ఎర్రమోని శివయ్య, గూళ్ల చెన్నకేశవులు, గంగనమోని హేమ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

**మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్**



**కొత్తకోట జులై 12 ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాల సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుకెషిని విశ్వేశ్వర్ అన్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం వార్డులలో నిర్వహించే డ్రై డే కార్యక్రమాన్ని 8వ వార్డులలో ప్రారంభించి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ నిల్వ నీటిని తొలగించే విధానం పై ఆ వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు నిల్వ లేకుండా చేయాలని లేనిపక్షంలో శుభ్రమైన నీటిని నుండి దోమలు తయారై ప్రమాదకరమైన డెంగ్యూవ్యాధికి దారితీస్తుందని అన్నారు.దీంతో పాటు మలేరియా, టైఫాయిడ్ లాంటి భయాంకరమైన జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు చీర్ల నాగన్న సాగర్,ఖాజా మైనోద్దిన్, కో ఆప్షన్ సభ్యులు జేఎమ్ మిషేక్, తహసీన్‌వహీద్ అలీ, మున్సిపల్‌శానిటరీ ఇన్స్పెక్టర్‌వెంకటయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీధర్, వార్డు ఆఫీసర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆర్పిలు, ఆశా వర్కర్లు, వాటర్ వర్క్స్ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలి

**బిజెపి మండల నాయకులు రాజమౌళి ముదిరాజ్**



**కొత్తకోట జులై 12 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బిజెపి మండల నాయకులురాజమౌళి ముదిరాజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఎన్నికల హామీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవతరగతి పాసైన విద్యా ర్థులకు 10 వేలు, గ్రాడ్యుయేషన్‌కి 25 వేలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కి ఒక లక్ష రూపాయలు, పీహెచ్‌డికి ఐదు లక్షలు ఇస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే హామీని అమలు చేయా లని భారతీయ జనతా పార్టీ నుండి చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇప్పటికి వరకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా విద్యార్థుల జీవితాలతో కాంగ్రె స్ ప్రభుత్వం ఆడుకుంటుందని మండిపడ్డారు. డిఎస్సి నోటిఫికేషన్ వేసి నెల రోజుల్లో పరీక్ష పెట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు.కనీసం2,3 నెలలు పరీక్షలకు సన్నద్ధంకావడానికి గడువు ఇవ్వకుండా దరఖాస్తుల గడువు ముగిసిన వెంటనే పరీక్ష పెట్టడం సరి కాదన్నారు. డిఎస్సి నోటిఫికేషన్‌రద్దు చేయాలనీవిద్యార్థులు ధర్నాలు చేస్తుంటే పోలీసు బలగాలతో లాఠీచార్జిలు చెయించి కేసులు నమోదు చేయడం సరికదన్నారు. వెంటనే డిఎస్సి రద్దు చేసి రాష్ట్రంలో విద్యాశాఖలో ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయో వాటన్నిటిని కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా వీడ్కోలు సన్మానం



**ఉప్పునుంతల,జులై 12 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమి బాలుర పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు, పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్‌ఎం బాలమణి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో హెచ్‌ఎంగా పని చేసిన లక్ష్మీనారాయణ విద్యార్థులకు అందించిన సేవల పట్ల పలువురు అభినందించారు. తక్కువ సంఖ్య గల విద్యార్థులను అధిక సంఖ్యకు పెంచే కృషి చేసిన ఫలితం మరువలేమని పలువురు కొనియాడుతూ ఆయనను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం బాలమణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, బదిలీపై వెళ్లిన పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ అరుణ,నూతనంగాపాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, చందన,గాజుల వెంకటేష్,పద్మావతి,సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు రామస్వామి, స్థానికులు పాతుకుల రామచంద్రయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**వెల్దండ, జులై12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గుండాల అంబరామ లింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీని ఎండోమెంట్ మహబూబ్‌నగర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీణాధారి, ఈఓ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. దేవాలయ నూతన కమిటీ చైర్మన్‌గా మల్లెపల్లి సందీప్‌రెడ్డి, మెంబర్లుగా బి.మల్లయ్య, వావిళ్ల తిరుపతయ్య, కొమ్ము లింగమయ్య, కొమ్ము అంజయ్య, ఎం.పద్మమ్మ, ఈ.అరుణ్‌కుమార్, ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ఆర్.శివ కుమా ర్‌లు ఎన్నికయ్యారు. శుక్రవారం నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించి శాలువాలు,పూలమాలలతోఘనంగా సన్మానించారు.కార్యామకంలో నాయకులు పర్వత్‌రెడ్డి, రామస్వామి, కిషన్, కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

# లయన్స్ క్లబ్ 22వ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

- లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డివి చారి
- లయన్స్ క్లబ్ వారి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే



నూతన అధ్యక్షుడు డివి చారిని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్,జులై 12 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ 22వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ 2024,25 సంవత్సరానికిగాను నూతన అధ్యక్షుడిగా డివి చారి నియమితులయ్యారు. కార్యదర్శిగా శ్రవణ్ కుమార్‌రెడ్డి, కోశాధికారిగా అంజనప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరుకాగా ప్రోగ్రాం ఛైర్మన్‌గా గవినోళ్ల గోపాల్‌రెడ్డి, కో ఛైర్మన్‌గా సత్యాంజనేయులు వ్యవహరించారు. క్లబ్ ఎక్స్ టెన్షన్ ఛైర్మన్‌గా నటరాజ్, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి, వక్తగా రాధాక్రిష్ణ పాల్గొన్నారు. తొలుత లయన్స్ క్లబ్‌వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూజా కార్యక్రమం నిర్వహించారు.ఆ తర్వాత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇతరులు కలిసి మొక్కలు నాటారు. అనంతరం రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ నటరాజ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది మున్సిపల్ కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు.ఆ తర్వాత చిన్నారులు చేసిన సాంస్కృతిక నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత నూతనంగా ఎమ్మెల్యేగా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎన్నికైన వాకిటి శ్రీహరికి లయన్స్ క్లబ్ తరపున శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గత ఏడాది లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి లయన్ అంబదాస్ చదివి వినిపించిన అనంతరం నూతన అధ్యక్షుడు డివి చారికి బాధ్యతలు అప్పగించడంలో భాగంగా గంట, గ్యావెల్‌ను అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన డివి చారితో పాటు ఇతర కార్యవర్గాన్ని సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత డాక్టర్స్‌డేలో భాగంగా వైద్యులు డా. పార్వతి ప్రాణేశ్, డా. సునీత బాల నర్సయ్య, డా. మాధవి, అనిల్‌కుమార్‌లను శాలువాతో సత్కరించారు. ఇటీవలే పదవి విరమణ పొందిన రిటైర్డ్ టీచర్ అరుణలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సత్కరించారు. లయన్స్ క్లబ్ మక్తల్‌కు రాష్ట్రంలోనే మంచి పేరుందని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేసిఉన్నత స్థాయికి చేరుకోవాలనిసూచించారు.కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, బి.కొండయ్య, రాజులఆశిరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, జుబేర్, బస్వరాజ్, కోళ్ళ వెంకటేష్, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, కావలి తాయప్ప, సూగూరు జైపాల్‌రెడ్డి, సుకన్య చంద్రశేఖర్, సిద్ధలింగప్ప, కట్టా వెంకటేష్, ఆడెం శ్రీనివాస్,నాగరాజ్,సాయిజ్యోతివెంకటయ్య, పాపిరెడ్డి,మామిళ్ల పృథ్విరాజ్,శరణప్ప,ప్రభావతి,రవికుమార్‌గౌడ్, విక్రమ్, జయశ్రీ పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ



రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఛైర్మన్ సరిత

**గద్వాల ప్రతినిధి జులై 12 ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన రైతు భరోసా అమలులోకి తీసుకువచ్చే కార్యక్రమంలో భాగంగా అన్నదాతల అభిప్రాయాల మేరకే రైతు భరోసా పై తుది నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పంట సహాయం ఏవిధంగా చేస్తే బాగుంటుందనే అభిప్రాయం స్వయంగా రైతుల నుండి తీసుకోవడానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రైతుల ముందుకు వచ్చారని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రైతు భరోసా అభిప్రాయ సేకరణలో భాగంగా శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులతో వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశం మందిరంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జుపల్లి కృష్ణరావు, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు జిల్లా కలెక్టర్లతో హాజరయ్యారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాజీ జడ్పిచైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి సరితలు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 10 ఎకరాల కంటే తక్కువ ఉన్న రైతులు 90 శాతం కు పైగా ఉన్నారని, వారందరికి రైతు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో అత్యధిక మంది రైతులు ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని వాటికి 10 ఎకరాల వరకు రైతు భరోసాఇవ్వాలని సూచించారు. కష్టపడి పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి తప్ప వందల ఎకరాలు ఉన్నవారికి, ఇప్పటికే వెంచర్లు అయిన వాటికి, కొండలు, గుట్టలకు, ఇన్‌కంటాక్స్ పరిధిలో ఉన్నవారికి రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కౌలు రైతులకు సైతం రైతు భరోసా ఇవ్వాలని అదే సమయంలో రైతుకు సైతం ఇవ్వాలన్నారు. సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు ఎరువులు యంత్రాలు ఇవ్వాలనిఅదే విధంగా రైతు భరోసాతో పాటుగా పంటకు అదనంగా బోనస్ చెల్లించాలని కొంతమంది రైతులు కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి,స్థానిక శాసనసభ్యులు తూడిమేఘారెడ్డి,ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కె.రాజేశ్‌రెడ్డి, అచ్చంపేట నుండి వంశీకృష్ణ,మక్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేలు పర్ణిక రెడ్డి, అనిరుద్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ కలెక్టర్లు విజయేందిర బోయి, వనపర్తి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నాగర్‌కర్నూల్ కలెక్టర్‌బాదావత్ సంతోష్,నారాయణపేట కలెక్టర్ సిక్త పట్నాయక్, అదనపు కలెక్టర్‌లు రైతులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజేంద్రప్రసాద్ యాదవ్, నాయకులు తదితరులు ఉన్నారు.

## నెట్టెంపాడు కాలువ బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



**ఇటిక్యాల జులై12 ప్రభాతవార్త:** లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసేందుకు అలంపూరు ఎమ్మెల్యే విజయుడు పెద్దదిన్నె గ్రామానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాల్ దిన్నె గ్రామానికి చెందిన అలంపూర్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామ్ దేవ్‌రెడ్డి అలంపూరు ఎమ్మెల్యే విజయుడు దృష్టికి పలు సమస్యలను విన్నవించారు. మండల పరిధిలోని నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు కింద 100వ ప్యాకేజీ కింద పనులు ఏళ్ల తరబడి పెండింగులో ఉండగా రైతులకు సాగునీరు అందడం లేదని, మొగలి రావల్ చెరువు గ్రామ అడ్డరోడ్డు నుండి పెద్దదిన్నె గ్రామం మీదుగా షాబాద్ గ్రామం వరకు ప్రజలకు కొత్తగా బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని అంతేకాక పెద్దదిన్నె గ్రామంలో పాత రైల్వే గేటు మూసి వేసి అర కిలోమీటర్ దూరంలో పాత రైల్వే గేటు మూసివేసి అర కిలోమీటర్ దూరంలో రైల్వే అధికారులు ఆర్‌ఓఆర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా యువత నుండి పాఠశాలకు అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయానికి గోపాల్ దిన్నె గ్రామానికి రైతుల వ్యవసాయ పంట పొలాలకు అలాగే శివంపల్లి ఎర్రవల్లి వైపు వెళ్లాలంటే పెద్దదిన్నె గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైల్వే అధికారులతో మాట్లాడి పాత గేటు కింద రోడ్డును తవ్వి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా శివనంపల్లి గ్రామ సమీపం నుండి ఇటిక్యాల మండల కార్యాలయం సమీపం వరకు ఆగిపోయిన బీటి రోడ్డును పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రామ్ దేవ్‌రెడ్డి ఎమ్మెల్యే విజయుడు దృష్టికి తీసుకుపోయారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దదిన్నె బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పార్టీ ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## సిఐటియు నాయకుల అరెస్టు



**కొత్తకోట జులై12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రానికి శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నడంతో ముందస్తుగా కొత్తకోట పోలీసులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, వికలాంగుల సంఘం జిల్లా కన్వీనర్ భీమా ప్రభాకర్ శెట్టిలను ఉదయం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి సొంత పూచి కతో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్య క్షులు బొబ్బిలి నిక్సన్‌మాట్లాడుతూ అరెస్టులు కాదు ఆరు గ్యారెం టీలను అమలు చేయండి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచిన కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు అమలు చేయక పోవడం విడ్డూరం ఉందని ఆరోపించారు. కార్మికులకు ఇచ్చిన హామీ ని నిలబెట్టుకోవాలని పట్టణంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఉపాధి హామీకూలీలకు రోజువారి వేతనం400 పెంచాలని పెండింగ్లో నా అభయాసం డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 500 రూపాయలకు సిలిండర్ ను ప్రజలకు అందించాలని పక్క గృహాలు లేని వారు వందలాది మంది ఉన్నారని వారినందరిని గుర్తించి ఇండ్ల నిర్మాణం కొరకు నిధులు కేటాయించి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎంపీడీఓకు వినతి

**కల్వకుర్తి, జులై 12 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు తమకు ఉపాధి కూలీ డబ్బులు పడటం లేదని శుక్రవారం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఎంపీడీఓ వెంకట్రాములుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ 250 మంది కూలీలకు జాబ్ కార్డులు ఉన్నాయని, 150 మంది కూలీలకు ఉపాధి కూలీ డబ్బులు పడటం లేదని పలు మార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మా డబ్బులు ఇప్పించాలని ఉపాధి కూలీలు అనుసూయ, అలివేలు, సుభద్ర, రాములమ్మతో పాటు పలువురు కూలీలు వినతి పత్రం అందించారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ఆత్మకూర్ జులై 12 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని మోట్లంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు అశోక్ కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయాన్ని తెలుసుకుని మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి శుక్రవారం రోజు బాధిత కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద ఎదురైనా తాను ముందుండి ఆదుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని బాధ్యత కుటుంబానికి భరోసా ఇచ్చారు. మండలంలోని ప్రతి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తన భుజస్కంతాలపై ఉందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా రోడ్డుప్రమాదంలో గాయపడి కాలు విరిగిపోయిన బాధితుడికి వైద్య పరంగా అన్ని విధాలుగా సహాయపడేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంబడి కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్, రహమతుల్లా ,తులసిరాజు యాదవ్, నల్లగొండ శ్రీనివాసులు ,మోట్లంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోండి

**బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ సుధా కిరణ్**

**కొత్తకోట జులై 12 ప్రభాతవార్త:** కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్షిప్ పోర్టల్ ద్వారా ప్రతి ఏట ఒకటవ తరగతి నుండి పీజీ కోర్సులు అభ్యసించే బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందిస్తుందని కార్మిక శాఖ సంక్షేమ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ సుధా కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 అకాడమిక్ సంవత్సరానికి విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడానికి కేంద్ర కార్మిక శాఖ ప్రకటన జారీ చేసిందని తెలిపారు. ప్రీ మెట్రిక్ కేటగిరిలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల ఆగష్టు 31 వరకు ఉందని తెలిపారు. అలాగే పోస్ట్ మెట్రిక్ కేటగిరిలో 11వ తరగతి నుండి పై బడిన కోర్సులు అభ్యసించే విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు అక్టోబర్ 31 వరకు చివరి తేదీ ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు స్కాలర్షిప్ పోర్టల్ ను సంప్రదించాలని కోరారు.

## ఎంకె స్పోర్ట్స్ షాప్ ప్రారంభం

**కొత్తకోట జులై 12 ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ యువ నాయకులు న్యాయవాది మునగారి కృష్ణ ఎంకె స్పోర్ట్స్ షాప్ ను శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, షాప్‌ను ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపారు.షాపులో ఏర్పాటు చేస్తున్న స్పోర్ట్స్ సామాగ్రిని పరిశీలించారు. అనంతరం యువ న్యాయవాది మునగారి కృష్ణ ఆఫీస్‌ను సందర్శించిన్యాయ వృత్తిలో సమాజానికి మంచి చేయాలనీ కోరుతూ శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి, బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మేస్త్రిశ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి,మిషేక్,రాకేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ఇటిక్యాల జులై12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు చంద్రకళ, ప్రశాంతి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇటీవల బదిలీపై వచ్చిన నూతన హెచ్‌ఎం గోవిందు ఆధ్వర్యంలో బదులుపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. ఉదండాపురం మిస్డ్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసిన కాంతరెడ్డి బదిలీ కాగా ఆయనకు సన్మానం చేశారు. అదే విధంగా పుటాన్‌దొడ్డి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులుబదిలీ కాగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల జిహెచ్‌ఎం పాగుంటున్న ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు, విద్యార్థులు ఎంఈఓ కార్యాలయసిబ్బంది ఖాజా, హనుమంతు, శ్రీను తదితరులు ఉన్నారు.



పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయునికి ఘన సన్మానం చేస్తున్న దృశ్యం

**కోయిల్‌కొండ, జులై12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కిషన్ పదోన్నతిపై వెళ్తుండడంతో ఆయనకు పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్తులు, ఆత్మీయులు పూలమాలలతో,శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు కిషన్ అందించిన సేవలు మరువలేనివని వారు పేర్కొన్నారు. క్రమం తప్పకుండా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరిగిందన్నారు. నూతనంగా ఇబ్రహీంనగర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా నర్సింలు బాధ్యతలను చేపట్టారు. గ్రామస్తులు పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకుసన్మానం చేస్తూనూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతంపలికారు.కార్యక్రమంలోగ్రామస్తులు పాల్గొన్నారు.

**పాఠశాలకు గ్యాస్ సిలిండర్ అందజేత:** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ లక్ష్మి నర్సింలు మాజీ ఎస్ఎంసి ఛైర్మన్ లక్ష్మీ బాలకృష్ణయ్య పాఠశాలకు గ్యాస్ సిలిండర్, స్టౌను అందజేశారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల బృందం ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, జులై 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొరటికల్ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమానికి వెల్టూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవిశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదోన్నతి పొంది బదిలీపై వెళ్లినలక్ష్మయ్య, మొహమ్మద్ బురాన్, దీర్ఘకాల బదిలీపై వెళ్లిన రాజేష్, రమేష్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా పాఠశాలకు బదిలీపై వచ్చిన అశోక్, భాస్కర్‌రెడ్డిలను పూలమాల,శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిశేఖర్ మాట్లాడుతూ నూతన స్కూల్‌లకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. అదే విధంగా ఈ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తున్నప్పుడే సమాజం వారిని గుర్తిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు నరేష్, విఘ్నేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు పడకంటి వెంకటేష్

**వెల్దండ, జులై 12 ప్రభాతవార్త:** వెల్దండ మండలం రాచూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయులు టి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు నారాయణ, శ్రీనివాస్, జ్యోత్స్న, శ్రీలతలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పడకంటి వెంకటేష్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా కుప్పగండ్ల గ్రామ పంచాయతీలోని గొల్లొనిపల్లిలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రవి, పావనిలను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తిటౌన్, జులై 12 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని సంజాపూర్ పాఠశాలలో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వహించి, ఇటీవల నిర్వహించిన బదిలీలలో భాగంగా ఉపాధ్యాయులు రజిత,అమ్ములు బదిలీఅయ్యారు.శుక్రవారం బదిలీ అయిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, పాఠశాల పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## 15 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

**మక్తల్,జులై 12 ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించిన వాహన తనిఖీల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని, బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు మక్తల్ ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఎరుకలి రమేష్ అనే వ్యక్తి గత కొంతకాలంగా మక్తల్, ఉట్కూర్ చుట్టు పక్కల గ్రామాల్లో రేషన్‌లబ్దిదారుల నుంచి బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతంలో ఎక్కువ ధరకు విక్రయించి లబ్ది పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

**మక్తల్,జులై 12 ప్రభాతవార్త :** సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని మున్సిపల్ కౌన్సిలర్ జి. ప్రసన్న బలరాంరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం వద్ద గల పల్లె దవాఖాన వద్ద శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దవాఖాన ఆవరణలో వైద్యురాలు వీరోచితతో కలిసి మొక్కలను నాటి నీళ్ళు పోశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జి. బలరామ్‌రెడ్డి, ఏఎన్ఎం సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

